
# సినీ బేతాళ కథలు





**– డా. కె.వివేకానందమూర్తి**

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 46 -

### - గట్టి చెల్లెలు -

**విసుగు విసిరేసిన** విక్రమార్కుడు, మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడక సాగించాడు.

'విక్రా! దారిలో నీకు శ్రమ అనిపించకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను!' – అని బేతాళుడు చెప్పడం ప్రారంభించాడు.

'– కీళ్ల ప్రసాద్, కీళ్ల ధర్మారావు అనే సోదరులిద్దరూ డాక్టర్లయి, కీళ్ల వైద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. కీళ్ల ప్రసాద్ భార్య కీళ్ల మర్దన, కొడుకు కీళ్ల ఖరేల్, కోడలు కీళ్ల శాంతి కూడా కీళ్ల వైద్యంలో నిపుణులు. ఇక కీళ్ల ధర్మారావు భార్య కీళ్ల వాపిని, కూతురు ఎముకల రాణి, అల్లుడు ఎముకల రాజు కూడా ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్‌లు. అంతా వొకే యింట్లో కలిసి వుంటారు. వాళ్లదొక 'జోయింట్'ఫామిలీ. కీళ్ల ప్రసాద్‌కి తెలుగు సినిమాలంటే వ్యామోహం. నిర్మాతగా మారి, 'అతకన్ బతకన్' అనే తమిళ చిత్రం రైట్స్ కొని తెలుగులో 'అతకని బతుకులు' పేరుతో నిర్మించాడు. ఆ చిత్రం ఘనవిజయం సాధించి కోట్లు పోగుచేసింది. సక్సెస్ అయిన తన తొలిచిత్రం పేరుతో కీళ్ల ప్రసాద్ 'అతకని బతుకులు' అనే పెద్ద ఆర్థోపెడిక్ హాస్పిటల్ కట్టాడు. మొత్తం ఫామిలీ అంతా ఆ ఎముకల హాస్పిటల్‌ను నిర్వహిస్తూ, అక్కడే పనిచేస్తారు. ప్రతీ ఆపరేషన్‌కీ విపరీతంగా ఫీజు వసూలు చేస్తూ పేషెంట్లందరికీ కీలెరిగి వాత పెడుతున్నారు. హైదరాబాద్‌లో గొర్రె కసాయివాడినే నమ్ముతుంది. అంచేత యీ కీళ్ల డాక్టర్ల సంపాదన, క్షణానికి మూడు ఫ్రాక్చర్లు, ఆరు రిప్లేస్‌మెంట్స్‌తో సమృద్ధిగా పెరుగుతోంది. కీళ్ల ప్రసాద్‌కి ఫైనాన్స్‌కి లోటు లేదు. అంచేత తెలుగుచిత్రాల్ని విరివిగా నిర్మించసాగాడు. నిర్మాతగా బాగా నిలదొక్కుకున్నాడు.

కీళ్ల ప్రసాద్ చిత్రాలన్నిటికీ డైరెక్టర్ సిల్వర్ బాబు.

'అయితే మనం తదుపరి చిత్రం సేబడదామా?' అన్నాడు కీళ్ల ప్రసాద్.

'అవశ్యం – నేను రెడీసార్' అన్నాడు సిల్వర్ బాబు.

'మరి కథ రెడీవేనా?'

'కథలెప్పుడూ రెడీనే అండి. వచ్చిన చిక్కల్లా మెయిన్ ఆర్టిస్టులు దొరకడం కష్టంగా వుందండి.'

'అదేటీ?'

'అదేనండి మరి. సినిమాల ప్రొడక్షన్ నెంబరు పెరిగిపోయిందండి. హీరోలంతా బిజీ. యిక హీరోయిన్లయితే అస్సలు కనిపించలేదండి.'

'ఏటీ అంత సన్నబడిపోతున్నారా!'

'సన్నబడ్డం కాదండి. దక్షిణాది హీరోయిన్లు, ఉత్తరాది హీరోయిన్లు పక్కటెముకలు చిట్లిపోయి తమ హాస్పిటల్లోనే శ్వాస అందక అడ్మిట్ అయి అవస్థపడుతున్నారండి.'

'అదెలా జరిగింది?'

'ఎలా అంటే - మన హీరోలంతా బిజీ అని చెప్పాను కదండి. బిజీ అంటే సినిమాలతో బిజీకాదండి. హీరోయిన్లు దొరక్క - మరి అంతా తమ హాస్పిటల్లోనే ఆపసోపాలు పడుతున్నారు కదండీ. అంచేత వేరే హీరోయిన్లని వెదుక్కోడంలో బిజీ అయిపోయారండి.'

'అది సరేనయ్యా ఆల్లందరికీ వరాసగా రిబ్స్ ఫ్రాక్చర్లెందుకయ్యాయో యివరంగా యిసదీకరించు.'

'ఏవీ లేదండి. మన వాళ్లకెప్పుడూ కొత్తదనం కావాలని, వెరైటీ యివ్వాలని మన నిర్మాతలు, డైరెక్టర్లు అన్య భాషా హీరోయిన్లను దిగుబడి చేసుకుంటున్నట్టే, అన్య భాషా హీరోలను కూడా ట్రై చేద్దావనుకున్నారండి.'

'అలాగా, అయితే?'

'అయితే గియితే కొశ్చనేంవుందండీ! మనవాళ్లను కాదని వొక వొరిస్సా హీరోని తోలుకొచ్చారండి.'

'తమిలా కాదు, కనడం కాదు, మలాలీ కాదు. యీ వొరిసా ఆడేంటయ్యా?'

'ఆల్‌రెడీ టమిళ్, కన్నడ, మళయాళీ నటులు మన చిత్రాల్లో చిన్నా చితకా వేషాలన్నీ వేస్తున్నారు కదండీ. అంచేత ఈయన్ని తీసుకొచ్చారండి.'

'ఏటాడి పేరు?'

'పట్టు దొర అండి. పూర్తిపేరు "వుడుం పట్టుదొర". మరి పట్టుదొరగానే పాపులరండి.'

'అయితే యీ పట్టుదొరగాడు వీరోగా బాగా సేసాడా?'

'చేశాడండి. చాలా తెలుగు చిత్రాల్లో హీరో చేశాడండి. అందుకే తమ బొమికల హాస్పిటల్లో అంతమంది హీరోయిన్స్ అడ్మిట్ అయ్యారండి.'

'అదెలాగ?'

'ఎలాగంటే - అదేనండి అసలు విషయం. ప్రేమ సన్నివేశాల్లో హీరోయిన్‌ని దగ్గరకు లాక్కుని, "డార్లింగ్! మనకి తలకాయలు వేరైనా శరీరాలు వొకటే" అని బలంగా దగ్గరకు లాక్కుని బాగా వొత్తేసుకోడం మొదలెట్టాడండి. హీరోయిన్ పిల్లలకి యెముకలు మాత్రం వేయించిన వడియాల్లా బాగా పెళుసు కదండీ! అంచేతనండి - యీ రిజల్టు'

'మరయితే మన తదుపరి సిత్రం సంగతేటి?' అడిగాడు నిర్మాత కీళ్ల ప్రసాద్.

'ఏవుంటుందండీ! మొదలెట్టేద్దాం.' అన్నాడు సిల్వర్ బాబు.

'మరి వీరో, వీరోయిన్లు దొరకొద్దా?'

'హీరోగా ఈ వుడుం పట్టుదొరనే ఫిక్స్ చేశానండి.'

'ఆడా! ఆడయితే మల్లా వీరోయిన్ పిల్ల బోంసు యిరగదియ్యడూ!'

'బోన్సు యిరగదీసినా మనకి సమస్యలేదండి. పిక్చరు ఆడినా ఆడకపోయినా తమ హాస్పిటల్ యిన్‌కమ్‌తో టాలీ అయిపోతుందండి. ఎనీవే, పట్టుదొర యాక్షన్ యిరగదీస్తాడండి. అదీగాక సేఫ్టీకోసం యీసారి కొత్త కథ ఆలోచించానండి.'

'ఏటాకత?'

'చెల్లెలు సెంటిమెంట్ అండి. నా చెల్లెలు, అన్నా చెల్లెలు, చెల్లి ప్రేమ, చెల్లెలి కాపురంలాంటి పేర్లన్నీ వాడేశారండి. అంచేత మన చిత్రానికి "గట్టి చెల్లెలు" అనే పేరు అనుకున్నానండి. చెల్లెలు అయితే హీరోని కాస్త దూరంగా వుంచొచ్చు. ఎముకలు విరిగే సీన్లు ఎవోయిడ్ చెయ్యొచ్చు.'

'సెబాసో' పేరు అదుర్సు. ఎవుకల దేవుందిలే. మన ఆసిపిటలు యెప్పుడూ మనకి స్టేండుబైగా వుంటుంది గదా! గొడవలేదు.'

'చెల్లెలు వేషానికి హీరోయిన్ దొరికిందండి.'

'ఎవరా పిట్ట?'

'మన స్టేట్‌లోనూ, నార్త్‌లోనూ హీరోయిన్స్ షార్టేజ్ గురించి మీకింతకు ముందే చెప్పాను. అంచేత వెదికి వెతికి మన చిత్రానికి వొక జర్మనీ పిల్లని బుక్ చేశాను.'

'సెబాసో! జర్మనీ పిల్లయితే మాంఛి స్ట్రాంగా, కంజాయింపుగా వుంటంది. పేరేటి?'

'డీ సెల్ బెంజి'

'ఏటీ - డీసెలు బెంజా - యిక తిరుగేలేదు. అయితే యిక జాప్యం దేనికి? సూటింగు మొదలెట్టెయ్!' - అని గ్రీన్ సిగ్నల్ యిచ్చాడు నిర్మాత కీళ్ల ప్రసాద్. దర్శకుడు సిల్వర్ బాబు రంగంలోకి దిగాడు.

షూటింగ్ మొదలైంది. ఒక పదిరోజులు షూటింగ్ నిర్విరామంగా జరిగింది. ఆ తర్వాత అకస్మాత్తుగా ఆగిపోయింది.

వానాలేదు. వరదా లేదు. టెక్నికల్ ప్రాబ్లమ్స్ యేవీ రాలేదు. అయినా నిర్మాత కీళ్ల ప్రసాద్ తదుపరి చిత్రం షూటింగ్ మరికొనసాగలేదు.' - అదీ సంగతి విక్రమార్కా! ఇప్పుడు చెప్పు కీళ్ల వారి కొత్త సినిమా నిర్మాణావస్థలో యెందుకు ఆగిపోయింది? 'గట్టిచెల్లెలు' షూటింగ్ పూర్తిచేసుకుని గట్టెక్కే మార్గానికి ఏ అవాంతరం కలిగింది? - నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ కపాలం పగిలి వెయ్యి ఛిప్సుగా చిందరవందరైపోతుంది." - అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు, - 'ఓ! బేతాళా! షూటింగ్ మొదలయ్యాక, వొకరోజు, హీరో వుడుం పట్టుదొర - అదే పట్టుదొర, తన చెల్లెలి వేషంలో వున్న 'డీసెల్ బెంజి' పిల్లని గట్టిగా వాటేసుకుని, 'చెల్లెమ్మా! అన్నగా నా ప్రేమని నీనుంచి యెవరూ వేరు చేయలేరు' అని చలేసి దుప్పటి కప్పేసుకున్నట్టు కప్పేసుకుని ఆమె అవయవాలన్నిటినీ తన వొంటికి తాపటం చేసేసుకుని (..సెన్సార్ కట్) !

అప్పుడు దర్శకుడు సిల్వర్ బాబు, 'సార్! ఆవిడ మీకు చెల్లెలు, కత్రినా కైపుకాదు. దీపికా పడుకునే బాపతు కాదు. సన్నీలియోన్ అంతకన్నా కాదు. మీ డైలాగ్ కావులించుకోకుండా చెప్పండి!'- అన్నాడు.

అప్పుడు పట్టుదొర - 'నో. హీరోగా చేసి చేసి నాకీ టైపు యాక్షన్ అలవాటయిపోయింది. ఆ మాటకొస్తే మీ తెలుగు హీరోలు చెల్లిని ప్రేమించే యాక్షన్ కంటే నా నటన యింకా తక్కువ మోతాదులో వుంది. అంచేత నేనిలాగే చేస్తాను.' అని. 'చెల్లీ!' అంటూ మళ్లీ మళ్లీ డీసెల్ బెంజికి అతుక్కుపోయాడు.

అప్పుడు డీసెల్ బెంజి ‘అన్నియా, అన్నియా!‘ అంటూ పట్టుదొరకు యింకా దగ్గరగా జరిగింది.. వెంటనే పట్టుదొర ‘అమ్మా!‘ అన్నాడు. డైరెక్టర్ ‘అమ్మా కాదు మహాప్రభో! చెల్లీ! అనాలి‘ అన్నాడు.

అప్పుడు పట్టుదొర - ‘అమ్మ చెల్లో!‘ అని గావుకేక పెట్టి నేలకూలిపోయాడు. దర్శకుడు సిల్వర్ బాబు ‘ప్యాకప్‘ చెప్పి షూటింగ్ క్లోజ్ చేసేసాడు.

మర్నాడు కీళ్ల ప్రసాద్ ఫామిలీ హాస్పిటల్ ‘అతకని బతుకులు‘లో, అప్పటికే పక్కటెముకలు విరిగి పడుకున్న హీరోయిన్స్ వరసలో, పక్క బెడ్మీద - జర్మనీ యూరోయిన్ చేతుల్లో విరగ్గొట్టుకున్న రిబ్స్‌తో మూలుగుతూ పడున్నాడు హీరో వుడుం పట్టుదొర.

పవిత్రమైన సోదరి బంధాన్ని అపవిత్రము, అమానుషము, అనౌచిత్యము చేయు స్టార్ హీరోలకు, భగవంతుడు డీసెల్ బెంజ్‌గా అవతరించి కనువిప్పు కలిగించక‘ తప్పదు.

**సుదర్దర్శ మిదం రూపం**
**దృష్టవా నసి యన్మమ ।**
**దేవా అప్యస్య రూపస్య**
**నిత్యం దర్శన కాంక్షిణః ॥**

- ఓ! హీరో నీవిప్పుడు జూచిన నా విశ్వరూపమెవ్వరికిని చూడనలవికానిది. ప్రేక్షక దేవతలు దీనిని చూడవలెనని నిత్యమును గోరుచునే యుందురు. -‘ అని తను సమాధానం చెప్పడం ముగించగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు మళ్లీ యెగిరి వెళ్లి చెట్టెక్కేసి ఓ కొమ్మను వాటేసుకున్నాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments